"నిన్నేమైనా అన్నాడా?" తనలో ఉద్రేకం.

"ప్రకాశాన్ని...."

"ఏం చెయ్యమంటావ్-?"

"నేను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను...."

ఆ మాటలు- చల్లని ఐసివాటర్ తన చెవిలో ఒలికినట్లు—నిప్పుల వాన తన మనో క్షేత్రంపై కురిసినట్లు—వడగళ్ళు నూది మొనలతో తన వెన్నుపై రాలి పడినట్లు.

ప్రకాశం శారద వాళ్ళింటికి తరుచు వస్తుంటాడు. ఏదో బ్యాంకులో ఉద్యోగం. శారద వాళ్ళకి ఫామిలీ ఫ్రెండ్ కూడా!

"అతని కులం. మాకులం ఒకటి కాదు. మావాళ్ళకి అతనంటే ఇష్టమే కానీ. కులాంతర వివాహానికి ఒప్పుకోరు. నీవు కనక అండగా ఉంటే..." చెప్పుకు పోతోంది శారద.

ఊహ తెలిసిన తరువాత- తనకి మానసికంగా పెద్ద షాక్!

మనసు మొద్దుబారి. నోరు మూగవోయి. హృదయవీణా తంత్రులు తెగిపోయాయి.

అయిదు నిముషాలపాటు తన మనసులోని వేదననీ- గుండెలోని రోదననీ- హృదయంలోని బాధనీ నిగ్రహించుకొని. అతి కష్టం మీద అదువు చేసుకొని- 'అలాగే' అన్నట్లు తలూపాడు తను. అంతకు మించి తనేం చేయగలడు? ఏం చేస్తే మాత్రం ప్రయోజనం?

తను ఆమెను పెళ్ళిచేసుకోవాలని- ఆమె సాంగత్యంలో తన కలలు పండించుకోవాలని- ఇంకా ఎన్నెన్నో మధురమైన ఆశలతో- మనసులో ప్రేమామృతం నింపుకున్నాడు. కానీ- ఆ మాట ఆమె కెలా తెలియపరచడం-? ఎప్పటి కప్పుడు చెప్పాలనుకుంటూనే వాయిదా వేశాడు. ఇప్పుడు చెప్పినా- వృథా ప్రయాస...

ఆ క్షణం నించే తనకి జీవితం మీద విరక్తి పుట్టేసింది. బ్రతకాలి- ఏదో సాధించాలి అన్న ఉత్సాహం అణగారిపోయింది. శారద అయినా సుఖంగా ఉంటే చాలు- అనుకున్నాడు.

కొద్ది రోజుల్లోనే శారదకీ- ప్రకాశానికీ గుడిలో పెళ్ళి జరిగిపోయింది తన ఆధ్వర్యంలో! పరువు- ప్రతిష్ఠల భయంతోనో ఏమో పెద్దవాళ్ళు వీధిన పడలేదు. వాళ్ళ మానాన వాళ్ళని వదిలేశారు.

అదివరకటిలా ఆమెను తరుచు కలుసుకునేందుకు కుదరడం లేదు. ఒక వేళ కలిసినా- ఏవో పైపై మాటలే తప్ప- మనసులు తెరచి పంచుకోవడం లేదు. ఎప్పుడైనా రోడ్డుమీద తారసపడితే ఒకరి నొకరు పలకరించుకొనే వాళ్ళు. అంతే! పెళ్ళయిన తరువాత ఆమెలో అందం ద్విగుణీకృతం కాగా ఆరిందాతనం అబ్బింది. ఈ మధ్య తను వేరేచోటికి మారాడు రూమ్ ఖాళీచేసి.

"శారదా! నీ గురించి ఆలోచించే వాళ్ళలో నిన్ను గుర్తు పెట్టుకొనే వాణ్ణి ఉన్నానని మరిచీ పోకు... ఏ అవసరం వచ్చినా నిర్మొహమాటంగా నాతో



చెప్పు..." ఆమె కలిసినప్పుడల్లా తను అనే మాట లివి.

"నాకు తెలీదా నూరిబాబూ నీ గురించి! మనను తెలిసి చరించే నీలాంటి స్నేహితుణ్ణి ఎవరు మాత్రం మరచిపోగలరు? తప్పకుండా చెప్తాను..." నవ్వుతూ అనేది.

ఆమె చల్లని నవ్వు తనని నున్నితంగా అలరించేది.

చలాకీగా- చురుగ్గా- చెలాయించుకుని రావలసిన తన కుర్రజీవితం- ఈ విధంగా పంచర్ అయిపోయి భారంగా- బరువుగా- దీర్ఘంగా- నిట్టూర్పులతో...

కొన్ని నెలలు గడిచాయి.

ఓ సాయంత్రం—

మర్నాడు శారద పుట్టిన రోజు కావడంతో- ముందుగానే శుభాకాంక్షలు తెలుపుదామని- చేతిలో పూలగుత్తితో, పెదవులపై పూలు విరిసినట్లనిపించే చిరునవ్వుతో ఆమె ఇంటికి చేరుకొని- ఆమెని పిలవబోయి- గుమ్మం దగ్గరే అప్రయత్నంగా ఆగిపోయాడు- లోపలి నుంచి ఏవో కేకలు వినబడ్డంతో.

"అతను అటువంటి వాడు కాదండీ... చాలా మంచివాడు" అంటోంది శారద ఏడుపు గొంతుతో.

"పెళ్ళి కాకుండానే రంకు నేర్చినదానివి- వాణ్ణి వెనకేసుకు రావడం నీకు పెద్ద సమస్య కాదులే..." ప్రకాశం గొంతు తీవ్రంగా- అసహ్యంగా!

శారదని అంత తీవ్రంగా- దుర్భాషలాడే సరికి- తనలో కోపం కట్టలు తెంచుకుంది. దానికి అడ్డుకట్టవేసే ప్రయత్నంలో తన పిడికిళ్ళు రెండూ గట్టిగా బిగుసుకున్నాయి. చేతిలోని పూల గుత్తి నలిగిపోయింది తన మనసులా. పెదవులమీద చిరునవ్వు చేయిజారిన పక్షిలా చుట్టుపక్కలెక్కడా లేకుండా ఎగిరిపోయింది.

ఎవరి గురించి ప్రకాశం మాట్లాడుతున్నది?

"వెళ్ళవే... ఆ నూరిబాబు గాడితోనే కులుకు. మంచి కట్నంతో పెళ్ళి అయుండేది నాకు- నువ్వూ నీ ప్రేమాఅడ్డు రాకపోతే ఎంగిలి విస్తరాకు లాంటి నిన్ను కట్టుకోవలసిన కర్మ..." ఏవో పేలుతున్నాడు ప్రకాశం. తన మెదడు మొద్దుబారిపోయింది. తన ప్రమేయం ఏమీ లేకుండానే తన కాళ్ళూ- చేతులూ దూకుడుగా కదిలాయి. కొది క్షణాలపాటు తనేం చేస్తున్నాడో తనకే తెలీని స్థితి. తనకి తెలిసేసరికి అంతా చేయిదాటి పోయింది. తన జీవితం- ప్రేమ- శారద జీవితం బూడిదలో పోసిన పన్నీరైపోయాయి. ఆమెకి బూడిదే మిగిలింది.

కారణం—

ఒళ్ళు తెలియని కోపంలో- విచక్షణా జ్ఞానం నశించిన ఉద్రేకంలో..

ఒక్క ఉదుటన లోపలికి గెంతి- ప్రకాశం మీదకు ఉరికాడతను...

పెనుగులాట...

"ఏయ్ నూరిబాబూ... ఆగు... ఆగు..." అంటోంది శారద.

తనామెని పట్టించుకోలేదు.

ఎట్టకేలకి శారద తన భుజం పట్టుకొని కుదిపి- ప్రయోజనం ఉండకపోయేసరికి- ఈడ్చి పెట్టి చెంపమీద బలంగా కొట్టింది.

తను ప్రకాశాన్ని వదిలి లేచాడు.

కానీ- కానీ-

అప్పటికే అంతా అయిపోయింది.

శారద నుదుట దివ్యంగా వెలగాల్సిన కుంకుమ నేలరాలిపోయింది.

ఆమె మెడలో పసుపుతాడు తెగి, మంగళసూత్రాలు కింద పడిపోయాయి.

ఆమె తలలో పువ్వులు జారిపడి చెల్లా చెదరైపోయాయి.

ఆమె పసుపుపచ్చని మేని రంగు వెలిసిపోయి- వెలితిగా తయారైంది.

ఆమె శరీరంలోని సగభాగం అయిన ప్రకాశం శరీరం...

నిర్జీవమై పోయింది.

"ఎంత పని చేశావు నూరిబాబూ!" అంటూ స్పృహ తప్పి పడిపోయింది- శారద.

ఆమెకు అయిదోతనాన్ని కలిగించిన తనే ఆమె అయిదోతనాన్ని చెరిపేశాడు.

కొన్ని తప్పులు- పొరపాట్లు ఎప్పటికీ సరిదిద్దు కోవడం కుదరదేమో!

ఆ తరువాత—

కోర్టు తనకి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

ఈ పది సంవత్సరాలూ శారద ఎక్కడుందో? అసలెలా ఉందో?

తనవల్ల జరిగిన అన్యాయానికి తనని రకరకాలుగా శపించుకుంటూ ఉందేమో!

ప్రకాశానికీ- శారదకీ తను దగ్గరుండి వివాహం జరిపించినప్పుడు "నీ అండ లేకపోతే మాకీ పెళ్ళి జరిగి ఉండేది కాదేమో" అందామె కృతజ్ఞతా భావంతో చూస్తూ.

ఇప్పుడామె ఏమంటుందో? తనతో అసలు మాట్లాడుతుందా?

రైలు దిగి నడుచుకుంటూ శారదవద్దకు చేరుకున్నాడు నూరిబాబు- కృతనిశ్చయంతో.

ఆమె... ఆమె... తన శారదేనా...?

తనకు తెలిసిన- తనతో కలిసి తిరిగిన శారదేనా?

ముద్దుగా... ముగ్ధలా... ముత్తయిదువలా... ఆరిందాలా తన ముందు మసలిన శారదేనా?

అలలు కెరటాల తాకిడికి ఎదురు నిల్చి- దిగమింగుకున్న సముద్రపుటొడ్డులా- కష్టాలు- బాధలు దిగమింగిన మొహం...

ప్రవాహంలో కొటుకుపోతున్న వాటితో- తన కేమీ సంబంధం లేనట్లుగా- పట్టనట్లుగా- నిశ్చలంగా- స్థిరంగా ఉన్న కాలవ గట్టులా నిర్లిప్తంగా- స్తబ్ధంగా ఉన్న వదనం.

ఒక్క మాటలో చెప్పాలంటే జీవచ్ఛవంలా...

"శారదా! నేను నూరిబాబుని" అన్నాడు నూరిబాబు.

ఆమె చాలా మామూలుగా చూసింది. ఆమె మొహంలో ఏ భావమూ గోచరించడం లేదు.

"నన్ను క్షమించు."

ఆ మాటలు వినబడ్డాయో లేదో!

"నీ ఈ పరిస్థితికి నేనే కారణం... నా తప్పును సరిదిద్దుకొనే అవకాశం ఇవ్వు..."

ఆమె తలెత్తి చూసింది.

"నా కారణంగా నీ నుదుట చెరిగిపోయిన కుంకుమని- నా చేతులతో సరిదిద్దుతాను..."

ఆమె కళ్ళలో చిమ్ముకున్న అశ్రువులు.

"ఇంతకంటే నా పాపపరిహారం లేదు. ప్రాయశ్చిత్తం లేదు..."

ఆమె బుగ్గల మీదుగా జారుతున్న కన్నీరు.

"నిన్ను నేనే పెళ్ళి చేసుకుంటాను..." తన నిశ్చయాన్ని బయట పెట్టాడు.

అప్పుడు పెదవి విప్పింది శారద- "నేనేం పెళ్ళికోసం మొహం వాచి లేను... అయినా నన్ను పెళ్ళి చేసుకోడానికేగా నా భర్తని నువ్వు చంపింది! కానీ నీకోసం నేనేం ఎదురుచూడడం లేదు! నీ గురించి ఆలోచించడం మానేసి చాలా కాలమైంది..." అంటూ ఏవేవో అరుస్తున్నట్లుగా చెప్పుకుపోతోంది.

యావజ్జీవ ఖైదీగా విడుదలయిన నూరిబాబుకి- యావజ్జీవం- శిక్ష ఈ క్షణం నుంచే మొదలైంది.

★

